ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
ఆదివారం 1 డిసెంబరు 2024



న్యూస్ బాక్స్

రేపు నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు ప్రారంభం

కళ్యాణ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో సోమవారం నూతనంగా మంజూరైన నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలను వర్చువల్ ద్వారా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ప్రారంభించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. నర్సింగ్ కళాశాల కోసం ప్రభుత్వం రూ.26కోట్లను మంజూరు చేసింది. కళాశాలకు కావాల్సిన ఫర్నీచర్, ఇతరత్రా సౌకర్యాలను కల్పిస్తూ ప్రభుత్వం ఈ నెల 21న జీవోను జారీ చేసింది. 58సీట్లతో సోమవారం నర్సింగ్ కళాశాలను ప్రారంభించనున్నారు. అదేవిధంగా 30సీట్లతో పారా మెడికల్ కళాశాలను కూడా ప్రారంభించనున్నారు. ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయినట్లు, ప్రారంభోత్సవానికి కలెక్టర్ హాజరవుతారని ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు.

గానరత్న కోకిల అవార్డులకు అరుణాదేవి, చిన్నబాపు ఎంపిక

మంథని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో ఈ నెల 4న ఘంటసాల జయంతి సందర్భంగా గానరత్న కోకిల అవార్డులకు మంథనికి చెందిన గాయకులు వనమాలై అరుణాదేవి, సర్వ చిన్నబాపులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు కొండేల మారుతి తెలిపారు. ఈమేరకు స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో అవార్డుల ప్రదానం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవార్డుల ప్రదానోత్సవానికి సంగీత ప్రియులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాయకులు సర్వ చిన్నబాపు, మాచీడి రవితేజగౌడ్, జవనహరి కుమారి, కొండపాక సత్యప్రకాష్, బోగోజు శ్రీనివాస్, నారమల్ల కృష్ణలు పాల్గొన్నారు.

- త్వరలో జమ కానున్న నాలుగో విడత డబ్బులు
- జిల్లాలో 8792 మంది రైతుల ఖాతాల్లో రూ.75.97కోట్లు..
- నాలుగు విడతల్లో 60,619 మందికి రూ.455.50కోట్లు మాఫీ



రుణమాఫీకి వేళాయె..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రుణ మాఫీ పథకం నాల్గవ విడతలో జిల్లాలోని 8,792 మంది రైతులకు ప్రయోజనం చేకూరనున్నది. రెండు, మూడు రోజుల్లో 75 కోట్ల 97 లక్షల 74 వేల 171 రూపాయలు ఆయా రైతుల ఖాతా జమకానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతుల జాబితాను విడుదల చేసింది. ఇప్పటివరకు జిల్లాలో మూడు విడతల్లో కలిపి మొత్తం 51,393 మంది రైతులకు 375 కోట్ల 58 లక్షల 4 వేల 931 రూపాయలు మాఫీ చేశారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు 29,724 మంది రైతులకు 149 కోట్ల 42 లక్షల 22 వేల 297 రూపాయలు మాఫీ కాగా, రెండో విడతలో లక్షన్నర వరకు 13,401 మంది రైతులకు 124 కోట్ల 40 లక్షల 76 వేల 460 రూపాయలు, మూడో విడతలో రెండు లక్షల వరకు 8,268 మంది రైతులకు 101 కోట్ల 75 లక్షల 6 వేల 174 రూపాయలు రుణ మాఫీ అయ్యాయి. నాలుగు విడతల్లో కలిపి 60,619 మంది రైతులకు 455 కోట్ల 50 లక్షల 57 వేల 126 రూపాయల రుణ మాఫీ కానున్నది.

● మండలాల వారీగా..

నాల్గవ విడతలో పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి మండలంలో 1837 మంది రైతులకు 14,15, 25,904 రూపాయలు, ఎలిగేడు మండలంలో 454 మంది రైతులకు 4,08,07,852 రూపాయలు, జూలపల్లి మండలంలో 263 మంది రైతులకు 2,41,32,976 రూ పాయలు, ఓదెల మండలంలో 722 మంది రైతులకు 6,68,62,826 రూపాయలు, కాల్వశ్రీరాంపూర్ మండ లంలో 521 మంది రైతులకు 4,38,32,653 రూపా యలు, సుల్తానాబాద్ మండలంలో 991 మంది రైతు లకు 8,35,92,120 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో 344 మంది రైతులకు 2,80,36,293 రూపాయలు, మంథని మండలంలో 1045 మంది రైతులకు 9,57,50,057 రూపాయలు, ముత్తారం మండలంలో 175 మంది రైతులకు 1,63,18,172 రూపా యలు, రామగిరి మండలంలో 338 మంది రైతులకు 3,07,04,098 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలంలో 104 మంది రైతులకు 83,19, 025 రూపాయలు, పాలకుర్తి మండలంలో 794 మంది రైతులకు 6,69,82,801 రూపాయలు, రామగుండం మండలంలో 341 మంది రైతులకు 3,08,08,688 రూ పాయలు, ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం మండలంలో 863 మంది రైతులకు 8,21,00,688 రూపాయలు వారి ఖాతాల్లో సోమ, మంగళ వారాల్లో జమ చేయనున్నారు.

● మిగతా రైతులకు కూడా..

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రైతులకు ఒకేసారి 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ మేరకు ఈ ఏడాది ఆగస్టు రెండో వారంలో రుణమాఫీ డబ్బులను జమ చేయడం ప్రారంభించారు. 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు రైతులు తీసుకున్న పంట రుణాలను కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రుణ మాఫీని వర్తింపజేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులను మినహాయించి మిగతా వారికి రుణమాఫీ చేయడం గమనార్హం. రుణ మాఫీకి అర్హత ఉండి పేర్లు తప్పు పడడం, బ్యాంకు ఖాతాలు, రేషన్ కార్డులు లేని వారికి, వివిధ కారణాల రీత్యా రుణ మాఫీ కాని రైతుల నుంచి ప్రభుత్వం ఆగస్టు నెలాఖరు వరకు దరఖాస్తులను స్వీకరించింది. అందులో భాగంగా 20వేల మందికి పైగా రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 12,187 మంది రైతులు రేషన్

మిగతా 8వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

స్ట్రక్చర్ మీటింగ్‌లో పరిష్కారం కాని సమస్యలు..

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

8



విలేకరులతో మాట్లాడుతున్న ఆరెల్లి కృష్ణ

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి..

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ

8

ఖని పీజీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కోల్‌సిటీటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కాలేజీలో శనివారం మండల న్యాయ సేవా మండలి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా అదనపు జిల్లా జడ్జి టీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటసచిన్ రెడ్డిలు మాట్లాడారు. విద్యార్థులు భారత రాజ్యాంగం, చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరండా ఉండాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు గాయత్రి విద్యార్థుల ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెస్టోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ సెలెక్షన్స్‌లో పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌కి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. అల్లెంకి మహాలక్ష్మి, కర్ర రుహిక, భూక్యా గీతిక, పెద్ది వెంకట్‌మాధవ్, అచ్చ లాస్యప్రియ, భూక్యా నందినిలు డిసెంబర్ 6,7,8 తేదీల్లో పంజాబ్ సునామ్‌లో జరిగే జాతీయస్థాయి సెస్టోబాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణశ్రీ విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జ్యోతినగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్టీపీసీ ఏజీఎం (హెచ్‌ఆర్) విజయ్ కుమార్ సిక్దర్ ప్రదర్శనను ప్రారంభించారు. వివిధ అంశాలపై విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు ప్రవీణ్ కె చౌదరి, వెంకటేశ్వరు, ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల నమూనాను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సెయింట్ క్లేర్ విద్యార్థుల ఎంపిక

జ్యోతినగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలో జరిగే రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలో ఎన్టీపీసీ సెయింట్ క్లేర్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొంటున్నారు. 8, 10 సంవత్సరాల విభాగంలో సెయింట్ క్లేర్‌కు చెందిన ఉజ్వల్, త్రిష్ణవేణి, హిమాన్ష్, దేవాన్ష్‌లు 100, 50 మీటర్ల పరుగులో పోటీ పడుతున్నారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో పాల్గొంటున్న విద్యార్థులను హెచ్‌ఎం ఫాదర్ డోమినిక్, పీఈటీలు సదేశ్, శ్యాం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు..

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెలలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎం కళ్యాణ్ గుణాకర్ ఎంపికయ్యారు. కరీంనగర్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో కళ్యాణ్ ప్రతిభను చాటుకోవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబరు 1న కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కళ్యాణ్ పాల్గొననున్నాడు. కళ్యాణ్‌ను పలువురు అభినందించారు.

నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్



కానిస్టేబుల్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని, పోలీసింగ్ ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలని రామగుండం సీపీ శ్రీనివాస్ నూతన కానిస్టేబుళ్లకు దిశా నిర్దేశం చేశారు. నూతనంగా కానిస్టేబుళ్లగా ఉద్యోగంలో చేరిన వారికి నియామక ప్రతాలు అందజేశారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి పోలీస్ శాఖకు 392మంది ఎంపిక కాగా ఇందులో 236మంది సివిల్, అందులో 83 మంది సివిల్ మహిళా కానిస్టేబుళ్లు, 156 మంది ఆర్మ్‌డ్ కానిస్టేబుళ్లు, అందులో 37 మంది ఆర్మ్‌డ్ మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. వివిధ పోలీస్ శిక్షణ కేంద్రాలకు శిక్షణకు వెళ్లి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తిచేసుకుని శనివారం కమిషనరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వృత్తిపరమైన జీవితంలో ఉన్న స్థాయికి ఎదగాలని, బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణ ఉండాలన్నారు. విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని, పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిన ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నీతి, నిజాయితీతో విధులు నిర్వహిస్తే ప్రజలు ఆదరిస్తారన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే అనేక సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమన్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని, అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని, అంకిత భావంతో సేవలుంది వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ కొత్త టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉన్నదని, చట్టబద్ధమైన పౌరులుగా మీ సేవలను చూసి సమాజం గౌరవించేలా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ, నిబద్ధత తో పనిచేసి పోలీస్ వ్యవస్థకు కృషి చేయాలని, కమిషనరేట్‌కు, తెలంగాణ పోలీస్‌కు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఏఓ అశోక్ కుమార్, ఆర్‌ఐలు దామోదర్, మల్లేశం, వామనమూర్తి, శ్రీనివాస్, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సంధ్య, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ కుటుంబానికి పరామర్శ

కళ్యాణ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు చుక్కల శ్రీనివాస్ తల్లి కనకవ్వ శనివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చుక్కల శ్రీనివాస్‌ను పరామర్శించిన వారిలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు బొమ్మక రాజేష్, దాసరి సాంబమూర్తి, మనాలీ ఠాకూర్, పాతిపెల్లి ఎల్లయ్య, గుడికందుల శివ తదితరులు ఉన్నారు.

సింగరేణి స్కూల్‌ను సందర్శించిన సీఎస్‌ఆర్ జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి పాఠశాలను శనివారం జీఎం (ఈఈ, ఈఎస్ఆర్) బెర్నాడేట్ నికోలస్ సందర్శించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో సీబీఎస్ఈ సెలబస్ ప్రారంభం కానున్నద దృష్ట్యా సంబంధిత పనుల పరోగతిపై కరస్పాండెంట్, హెచ్‌ఎంలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల భవన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. సీబీఎస్ఈ విద్యకు సంబంధించిన నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. వెంట కరస్పాండెంట్ అనిల్ కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ, హెచ్‌ఎం సుందర్‌రావు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మండలంలోని గర్రెపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బాలశక్తి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే క్రీడలపై ఆసక్తి చూపాలలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత గర్రెపల్లి..

మండలంలోని గర్రెపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా నిలిచింది. శనివారం రాత్రి పోటీలు ముగియగా విజేతగా గర్రెపల్లి జట్టును ప్రకటించి పది వేల నగదు బహుమతితో పాటు మెమోంటోలు ఇతర బహుమతులను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావులు అందజేశారు.

ఖని వ్యాపారికి బీఐసీసీఐ అవార్డు



చంద్రకాంత్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కోల్‌సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన యువ వ్యాపారి చంద్రకాంత్‌కు టీ కన్సల్ట్ కొలబ్రేషన్ కన్‌క్లేవ్ తెలంగాణ -2024 నిర్వహించిన కార్యక్రమంలో బీఐసీసీఐ అవార్డును గెలుచుకున్నారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ 30ఏళ్ల వయసులోనే ఉత్తమ యువ వ్యాపార వేత్తగా ఎదిగిన చంద్రకాంత్ మరిన్ని ఇన్నోవేషన్ చేయాలని, కార్పొరేట్ సంస్థలకు ధీటుగా రాణించాలని సూచించారు. చిన్న వయసులోనే వ్యాపార రంగంలో అడుగు పెట్టి చంద్రకాంత్ ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం చంద్రకాంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మధుసూదనచారి, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరితో పాటు వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఆరోగ్య శాఖ అధికారులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. అన్నప్రసన్న కుమారి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితుల హక్కులను కాపాడుతూ, వారి ద్వారా ఇతరులకు వ్యాధి సోకకుండా చూడాలని, తద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, డాక్టర్ కె.వి.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధిపై అందరు అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిస్సిక్రిష్టాన అన్నారు. మండల కేంద్రలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కుష్టువ్యాధిపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్లు, నాగమణి, లక్ష్మణ్, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని డిసెంబర్ 2 నుంచి 15 వరకు కుష్టు వ్యాధి సర్వే ఉంటుందని నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మిత తెలిపారు. గ్రామాల్లో ఉదయం 6గంటల నుంచి 9 గంటల వరకు ఆశ వర్కర్లు సర్వే చేస్తారని, ప్రజలు వారికి సహరించాలని కోరారు.

ఫుడ్ పాయిజన్ జరగకుండా చర్యలు తీసుకోవాలి



పాఠశాలలను బంద్ చేయిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

పెద్దపల్లి కల్చరల్ , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలలో వరుసగా ఫుడ్‌పాయిజన్ జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల ప్రీతంలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. విద్యార్థులు హాస్పిటల్ పాలవుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోకుండా విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్నాకొండ అదిత్య, అరవింద్, అభి, వంశీ, సాయి, తారణకొండ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించడంపై మండల పరిధిలోని పుట్నూర్‌లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, తోట ప్రశాంత్, మాదాసు శ్రావణ్, నార సత్తయ్య పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల వేధింపులు

- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాధితుడు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేటు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించాలని బ్యాంకు అధికారులు వేధింపులు తట్టుకోలేక ఇంటి యజమాని మజీద్ ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఎల్లారెడ్డిపేటలో శనివారం జరిగింది. తన భర్త కనిపించడం లేదని భార్య సల్మా కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె తెలిపిన మేరకు.. గ్రామంలోని మజీద్ ఇంటి నిర్మాణం కోసం ఐదేళ్ల కిందట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఐదు లక్షల రుణం తీసుకున్నాడు. వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు అంగీకరించాడు. ప్రతి నెల పద్ధతిలో డబ్బులు చెల్లిస్తున్నాడు. ఇటీవల మజీద్ అనారోగ్యానికి గురవడంతో నెల వారి డబ్బులు చెల్లించేందుకు ఆలస్యమైంది. దాంతో బ్యాంకు అధికారులు గడువు ముగిసిందని పేర్కొంటూ నిత్యం మజీద్ ఇంటికి చేరుకుని చెల్లించాలని ఒత్తిడి చేశారు. వారి వేధింపులు భరించలేని తన భర్త మజీద్ తమకు చెప్పపెట్టకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని బాధితురాలు సల్మా పేర్కొంది. ఘటనపై స్థానిక ఎస్ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా తమకెవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

మానకొండూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, లారీ లలితాపూర్ బస్టాండ్ మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.



ఓదెలలో సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోట



విక్రయానికి సిద్ధంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్

పండ్ల తోటల సాగుపై ఆసక్తి

- డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు
- వరికంటే లాభదాయకం కావడంతో మరికొందరి దృష్టి

ఓదెల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మయ్య సింగరేణి కార్మికునిగా పనిచేసి ఉద్యోగ నాలుగేళ్ల క్రితం విరమణ పొందాడు. ఓదెల శివారులో తనకున్న ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేశాడు. రసాయనిక పద్ధతుల్లో కాకుండా సేంద్రియ పద్ధతిలో పండ్ల తోటను సాగు చేశాడు. మొదట రూ.5 లక్షల పెట్టుబడితో ప్రణాళికలు రూపొందించిన లక్ష్మయ్య సిద్దిపేట నుంచి ఒక్కోటి రూ.50 చొప్పున డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు తెప్పించి సాగు చేశాడు. పెట్టిన ఏడాది నుంచే దిగుబడి ప్రారంభమైందని, ఎకరానికి రూ.40 వేల వరకు లాభం వస్తుందని లక్ష్మయ్య పేర్కొన్నాడు. ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకు పండ్లను కోసం సమీపంలోని వారసంతలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటానని లక్ష్మయ్య తెలిపాడు. ఓదెలతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధమవుతున్నారు. వరి పంటకంటే అధిక లాభం వస్తుండడంతో పలువురు రైతులు పండ్ల తోటలవైపు దృష్టిని సారిస్తున్నారు.

● ఇష్టంతో కష్టపడుతున్నా..

- చింతం లక్ష్మయ్య, రైతు, ఓదెల



సింగరేణి కార్మికునిగా పనిచేసే విరమణ పొందిన తర్వాత కాలక్షేపం చేయలేదు. ముందు నుంచే వ్యవసాయం అంటే చాలా ఇష్టం. అందుకే ఇష్టంతో డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధపడ్డాను. దీంతో అధిక లాభాలను పొందుతున్న పత్తి, వరి పంటలు సాగు చేసే బదులు పండ్ల తోటలను సాగు చేస్తే ఆర్థికంగా నష్టాలకు గురికారనే ఉద్దేశంతో డ్రాగన్ పండ్ల మొక్కలను తెప్పించి సాగుచేశాను. ఇతర పంటలకంటే రెండింతలుగా లాభాలు ఉంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రాగన్ మొక్కలను మిగతా రైతులకు అందజేస్తే గ్రామాల్లో మరికొందరు సాగు చేసే అవకాశాలున్నాయి.

హాస్టల్ విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

● సైనిక్ స్కూల్ పరిశీలనకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు



సుంకె రవిశంకర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చొప్పదండి/రామడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ పరిశీలనకు వెళ్తున్న రవిశంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురుకుల బాటలో భాగంగా ఆయన సైనిక్ స్కూలు సందర్శనకు వెళ్తున్న క్రమంలో రుక్మాపూర్‌లో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి రామడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు చేయూతని చ్చేందుకు పలు సంక్షేమ హాస్టళ్లు ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రసాద్(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పద్మనగర్‌కు చెందిన నాగిశెట్టి ప్రసాద్(36) ఉదయం వాకింగ్‌కు వెళ్లి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వెనకు నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య మీనాక్షి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరి మృతి

వీణవంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతిగల్ గ్రామానికి చెందిన వేముల సిద్ధార్థ(21) హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదవుతున్నాడు. రెండు నెలల నుంచి కళాశాలకు సరిగా వెళ్లడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 27న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి వేముల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య(52) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల శంకరయ్య మద్యానికి బానిసై ఈ నెల 28న తన పత్తిచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. శంకరయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టులో చేపల కాపలాకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన రెడ్డి శంకర్ (39) అనే వ్యక్తి ఈ నెల 23న కులవృత్తిలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యతో కలిసి రాత్రి చేపలు పట్టడానికి చెరువులో వేసిన వలలకు కాపలాగా వెళ్లారు. రాత్రి అక్కడ చెరువు వద్ద ఉన్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన శంకర్ ప్రమాదవశాత్తు చెరువు కట్ట పక్కన కింద పడిపోయాడు. అతడి కేకలు వేయడంతో ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యలు అక్కడికి వెళ్లి చూడగా అతని తలకు గాయమైంది. శంకర్‌ను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శంకర్ ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు గాయమై చికిత్స పొందుతూ మృతి చెందాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంభీరావుపేటలో దొంగతనం

గంభీరావుపేట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని దేవరాజు, మైసిరెడ్డి ఇళ్లలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇండ్లకు తాళాలు వేసి ఈ రెండు కుటుంబాలు వేరే గ్రామానికి వెళ్లారు. రెండు ఇండ్లలో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. దేవరాజ్ ఇంట్లో 10 వేలు నగదు, అర తులం బంగారం, 38 తులాల వెండి దొంగలు అపహరించారు, మైసిరెడ్డి ఇంట్లో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించినప్పటికీ ఆ ఇంట్లో ఏమీ చోరీకాలేదు. ఇదిలా ఉండగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులో గల కమాన్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నలువాల భగత్(26) అనే యువకుడు మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భగత్ రాత్రి సమయంలో తన బైక్‌పై లక్ష్మీపూర్ నుంచి జగిత్యాలలోని గాంధీనగర్ లో గల తన అత్తగారింటికి బయల్దేరారు. లక్ష్మీపూర్ కమాన్ వద్ద భగత్ ప్రయానిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో భగత్ తలకు బలమైన గాయాలై మృతిచెందినట్లు తెలిపారు.మృతుడి భార్య మధుమిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నిరంజన్ (ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సుల్తానాబాద్‌లో జరిగింది. ఎలిగేడు మండలంలోని బురాహన్ మియాపేటకు చెందిన గౌరు నిరంజన్ (35) అనే యువకుడు తన భార్య పిల్లలను చూడడానికి అత్తగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లికి ద్విచక్ర వాహనం పైనుంచి వెళ్తుండగా సుల్తానాబాద్-గట్టేపల్లి రోడ్డులో ఉన్న రైల్వే వంతెన సమీపంలో శనివారం తెల్లవారు జామున బైక్ అదుపుతప్పి ప్రమాదంలో నిరంజన్ మరణించాడని పోలీసులు తెలిపారు. నిరంజన్ రోడ్డుపై పడిపోయి ఉండగా కొందరు గమనించి 108లో సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు నిరంజన్ ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తాడని భార్య ఫిర్యాదులో పొర్కొంది.

ఇంటర్నేషనల్ స్యాండ్ ఫెస్టివల్‌కు శంకర్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన రేవెల్లి శంకర్ ఎంపికయ్యారు. కరీంనగర్ మంకమ్మతోటలో నివాసముంటున్న శంకర్ వివిధ దేశాల నుంచి హాజరయ్యే ప్రసిద్ధ సైకత శిల్పుల సరసన వుమెన్ పవర్, ఎకోటూరిజం, క్రీడలు, కల్చరల్, ఎన్విరాన్‌మెంట్ అంశాలపై సైకత శిల్పాలను రూపొందించనున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో కూడా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌లో పాల్గొని సైకత శిల్పాలను రూపొందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఆగస్టు 15న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కాగా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు ఎంపికైన రేవెల్లి శంకర్‌కు పలువురు అభినందిస్తున్నారు.



ఒరిస్సాలో సైకత శిల్పాలను రూపొందించిన శంకర్ (ఫైల్)

హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో అండర్-14 ఎస్‌జీఎఫ్ బాలబాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు శనివారం రెండో రోజూ కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి జైపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు హాజరయ్యారు. క్రీడకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలు రాష్ట్రస్థాయి హాకీ జట్లు పోటీపడ్డాయి. బాలికల విభాగంలో కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో నిజామాబాద్, హైదరా బాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో బి శ్రీనివాస్, టి శ్రీనివాస్, మధు, పీఈటీలు రాజిరెడ్డి, వేణుగోపాల్, సారయ్య, వి రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక ఉన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్



సమావేశమైన ధర్మపురి నియోజకవర్గ ఐద్వా సభ్యులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. ధర్మపురి పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నియోజకవర్గ సమావేశం లావణ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు భద్రత భరోసా లేకుండా పోయిందన్నారు. మహిళలు పోరాడి అనేక చట్టాలు సాధించుకున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. హత్యలు, అత్యాచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు వెంటనే తీసుకోకుండా ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాకుండా రాజకీయ నాయకులు అండతో బాధితులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. స్త్రీల హక్కుల కోసం ఐద్వా నిర్విరామ కృషి చేస్తూ మహిళా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేస్తోందని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ కన్వీనర్‌గా అద్దరి కవిత, కోకన్వీనర్లుగా లావణ్య, సరోజ, ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ కోమిటి చంద్రశేఖర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గర్వంతుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేష్ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

● డ్రగ్స్ పార్సల్, బ్యాంక్ రుణం, క్రెడిట్ కార్డు, ఉద్యోగాల పేరిట మెస్సేజ్‌లతో మోసాలు

● కమిషనరేట్‌లో 220 కేసులు, 15 మంది అరెస్టు ● 197 కేసుల్లో రూ. 1.09 కోట్లు రికవరీ

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హాలో.... మీ పేరు పద్మనా.... ఎయిర్‌పోర్ట్ నుంచి కస్టమ్స్ అధికారిని మాట్లాడుతున్న... మీ పేరిట పార్సల్ వచ్చింది. అందులో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్‌లున్నాయి. అంటూ ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఒక మహిళకు గుర్తుతెలియన వ్యక్తి వాట్సప్ కాల్ చేశాడు. దీంతో ఆ మహిళ భయపడిపోయింది. దీనిని ఆసరగాగా తీసుకున్న సైబర్ నేరగాడు.. మీపై సైబర్ క్రైం నమోదవుతుందని చెప్పాడు. కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ క్రైం పోలీసు అధికారిని మాట్లాడుతన్నాడంటూ మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. మీపై సైబర్ క్రైం నమోదైంది. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.... కేసు నుంచి బయటపడాలంటే ఈ విషయం ఎవరికి చెప్పకుండా.. కొంత డబ్బులు మేము చెప్పిన బ్యాంక్ ఖాతాకు జమచేయాలి అని చెప్పాడు. భయపడిపోయిన ఆ మహిళ తన ఖాతా నుంచి రెండు విడతలుగా 21.66 లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు అనుమానం వచ్చిన బాధితురాలు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే ఆ అకౌంట్ నుంచి డబ్బులు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు.చివరకు ఆ అకౌంట్ యజమానిని అరెస్టు చేశారు.

● కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఉద్యోగికి ఒక రోజు వాట్సప్‌కాల్ వచ్చింది. ఆ వాట్సప్‌లో పోలీసు యూనిఫాం ధరించిన అధికారి ఫొటో ఉంది. ఆ వ్యక్తి మాట్లాడుతూ హైదరాబాద్‌లో మీ కూతురు వద్ద డ్రగ్స్ పట్టుకున్నాము. సైబర్ క్రైం నమోదైంది.. డిజిటల్ అరెస్టు చేస్తాం అంటూ బెదిరించాడు. గంట ముందే ఆ ఉద్యోగి తన కూతురుతో మాట్లాడాడు. అటువంటిది ఏమీ లేదని, ఆ వాట్సప్‌కాల్ ఫేక్‌గా పసిగట్టి స్పందించకుండా కాల్ కట్ చేశాడు.

● ఎన్నో రకాల మోసాలు

ఈ విధంగా సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా డ్రగ్స్ పార్సల్, న్యూడ్ వీడియోకాల్స్, ఏపీకే ఫైల్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, షేర్ మార్కెట్, పిల్లలను అరెస్టు చేస్తున్నామంటూ కాల్స్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ



అదే స్థాయిలో అదే సాంకేతికతో మోసాలు చేస్తున్న నేరగాళ్లు పెరుగుతున్నారు. సైబర్ మోసగాళ్లు మొదట్లో ఏటీఎం కార్డుల పిన్ నంబర్, ఓటీపీ, కార్డులను మార్చి, ఫ్రాడ్ మెస్సేజ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల ద్వారా డబ్బులు కొట్టేసేవారు. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు.

● రూ. కోట్లు కోల్పోయిన బాధితులు

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లబారినపడి కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఇప్పటి వరకు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణాలో 220 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 197 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేశారు. 1.09 కోట్ల రూపాయలు సైబర్ క్రైం పోలీసులు రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ ఖాతా(మూల్ అకౌంట్) ద్వారానే బాధితుల నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ చిక్కకుండా పోతున్నారు.

● మూల్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్

సైబర్ నేరగాళ్లు ముందుగా ఒక వ్యక్తి గుర్తింపు కార్డుతో ఒక బ్యాంక్ ఖాతాను తెరిపించి, ఆ వ్యక్తికి ఐదు వేల రూపాయలు ముట్టచెబుతున్నారు. తరువాత ఖాతా బుక్కు, ఏటీఎం కార్డు వెంట తీసుకువెళతారు. సైబర్ నేరాలకు తన ఖాతాను ఉపయోగిస్తున్న విషయం ఆ వ్యక్తికి తెలియదు. సైబర్ క్రైం నమోదైన తరువాత పోలీసులు విచారణ చేపట్టడంతో మొదట డబ్బులు ఏ ఖాతాకు బదిలీ అయ్యిందనే విషయాన్ని గుర్తిస్తారు. సాంకేతికపరంగా ఖాతా కలిగిన వ్యక్తిపైనే కేసు నమోదవుతుంది. ఇటువంటి అకౌంట్‌ను మూల్ అకౌంట్ అంటారు. సైబర్ నేరాలకు నేరస్థులు ఉపయోగించే బ్యాక్ ఖాతాలు మూల్ ఖాతాలే కారణమని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఈ మూల్ ఖాతాల నుంచి డబ్బులను ఇతర సంస్థలకు బదిలీ చేసుకుంటున్నారు.

● డిజిటల్ అరెస్ట్..

వీడియో కాల్, స్కైప్, వాట్సప్ కాల్ ద్వారా అమాయకులకు సైబర్ నేరస్థులు కాల్ చేసి తాము కస్టమ్స్ అధికారులమని, నార్కోటిక్, పోలీసులు, సీబీఐ, ఈడీ, సైబర్‌క్రైం అధికారులమంటూ నకిలీ గుర్తింపు కార్డులు, నకిలీ అరెస్టు వారెంట్లు చూపెడుతూ నమ్మిస్తున్నారు. కేసుల పేరుతో భయపెట్టి డబ్బులు దండుకుంటున్నారు. పన్నుల ఎగవేత, డబ్బుల దుర్వినియోగం వంటి కారణాలను చూపెడుతూ అమాయకులను భయపెడుతున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులమని చెబుతూ నమ్మించేందుకు పోలీసు స్టేషన్లలా కనిపించే గదుల్లో కూర్చుని వీడియోలో కనిపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తాము విచారణలో సహకరిస్తామని, కేసులో పేరు లేకుండా చేస్తామని, కొంత డబ్బులు చెల్లించాలని నమ్మబలికి వారి బ్యాంకు ఖాతాలకు లేదా యూపీఐ ఐడీలకు డబ్బులను బదిలీ చేయించుకుంటారు.

● అవగాహన పెంచుకోవాలి

సైబర్ మోసాలపై ప్రజలు అవగాహ కలిగి పెంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతా, పిన్, ఆధార్, ఓటీపీ తదితర సమాచారాన్ని ఇతరులకు ఎట్టిపరిస్థితుల్లో చెప్పవద్దని వారంటున్నారు. నిజమైన పోలీసు, కస్టమ్స్, సీబీఐ, ఈడీ వంటి శాఖల ప్రభుత్వ అధికారులు డబ్బులు చెల్లించాలని, బ్యాంక్ ఖాతా వివరాలు అడగరనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ అరెస్టు అనేది ఉండదని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసింది. ప్రజలు ఈ విషయాలన్నీ గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు.

చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్య డ్రైవింగ్

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు చిన్నారి తనువుచాలించింది. సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం కాశెపల్లిలో శనివారం ఫరీదా - రాజ్ మహ్మద్ దంపతులు కూతురు ఏడాదిన్నర వయసు గల రఫీద తమ ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఈ ఇంటి ఎదురుగా ఉన్న షకీల్ అనే వ్యక్తి తన బొలెరో వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లే క్రమంలో వాహనం వెనక వైపు ఉన్న ఏడాదిన్నర పాపను గమనించలేదు. దాంతో వాహనం పాపపై నుంచి వెళ్లడంతో పాప మృతి చెందింది. చిన్నారి తండ్రి రాజ్‌మహ్మద్ బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. తల్లి ఫరీదా కన్నీరు మున్నీరవుతోంది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీపాదకాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

మంథని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీలో సీఐ రాజు, ఎస్ఐలు రమేష్, చంద్రకుమార్, నరేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు శనివారం పోలీసులు కార్డన్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి చాలన్ వేశారు. యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని సీఐ రాజు సూచించారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఈ నెల 5 నుంచి 10 తేదీ వరకు జరిగే 62 జాతీయస్థాయి సబ్ జూనియర్ రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పట్నాన శ్రీహన్సి, ఏ అమృత వర్షిణి ఎంపికయ్యారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన శ్రీహన్సి 9-11 సంవత్సరాల వయస్సు విభాగంలో, అమృత వర్షిని 5-7 సంవత్సరాల వయస్సు విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ గట్టు అనిల్ కుమార్, అసిస్టెంట్ బి నరహరి తెలిపారు.

హోటల్ గదిలో డబ్బులు మాయం

కరీంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వీపార్క్ హోటల్లో తనకు చెందిన 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పూడూరు మల్లేశం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మల్లేశం 28న వీ పార్క్ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని ఉన్నాడు. రూం నుంచి బయటకు వెళ్లి వచ్చేసరికి బ్యాగులోని 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన ఖుస్రోషాఖాన్



భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా ఖుస్రోషాఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం రీజియన్ల డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన ఈడీ ఖుస్రోషాఖాన్‌ను డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్‌భూపతిరెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎ విలాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోచయ్యలింగం, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, ఈడీ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు విజయమాధురి, వి మల్లయ్య, కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ సురేష్, లా ఆఫీసర్ రజనీకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య స్వాగతం పలికారు. వరంగల్, ఖమ్మం రీజినల్ మేనేజర్లు విజయభాను, సరిరాం, జోనల్ వర్క్‌షాప్ మేనేజర్ సుగుణాకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోన్ పరిధిలో స్థితిగతులపై ఈడీ ఖుస్రోషాఖాన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ముగిసిన సీపీఎం మహాసభలు

భగత్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమా సాహేబ్, జిల్లా కమిటీ సభ్యులుగా యు శ్రీనివాస్, సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి, రాజిరెడ్డి, శీలం అశోక్, డి నరేష్ పటేల్, జి రాజేశం, కోనేటి నాగమణి, కొప్పుల శంకర్, కో-అప్షన్‌స భ్యులుగా 15 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదిర్శవర్గ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్ తదితరులు తెలిపారు. ఎన్నికైన సభ్యులు పార్టీ పరిపుష్టతకు పాటుపడాలని కోరారు.



ఇంట్లోని వస్తువులతో వినాయకుడి చిత్రం



అమ్మవారి చిత్రం

ఆకట్టుకుంటున్న షాడో చిత్రాలు

ఇంట్లోని వృథా వస్తువులతో ప్రదర్శన

- ఇల్లంతకుంట యువకుడి ప్రతిభ
- ఆర్ట్ విభాగంలో జాతీయ పురస్కారం



పాలతో గీసిన సాయిబాబా చిత్రం



చక్కెరతో గీసిన మదర్‌థెరిసా చిత్రం



పెన్నుతో గీసిన యువతి చిత్రం

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వృథా అనుకునే వస్తువులకు తన కళను జోడించి అబ్బురపరుస్తున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన సాన అనీల్‌కుమార్. చిన్ననాటి నుంచి సమాజంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలనది అనిల్ అభిప్రాయం. అదే లక్ష్యం విభిన్న కళాకారుడిగా మార్చింది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మొదట్లో పెన్సిల్, పెన్నులతో చిత్రాలు గీయడం ప్రారంభించాడు. అతడిని ప్రతిభను గుర్తించి పలువురు ప్రశంసించడంతో ఇంకా భిన్నంగా చేయాలని ప్రయత్నించాడు. ఇంట్లోని వస్తువులను ఒకదాని పక్కన మరొకటి చేర్చి వాటిపై వెలుతురు పడేలా చేసి షాడో (నీడ) చిత్రాలను ప్రదర్శించడం మొదలుపెట్టాడు. దీంతో సాన అనీల్ పేరు షాడో అనీల్‌గా మారింది. ఇంతేకాక పాలతో గాంధీ, చక్కెరతో మదర్‌థెరిసా, ఇసుకతో చెగువేరా చిత్రాలు వేశాడు. సుద్ద ముక్క, చీపురుపుల్లలతో పలు కళారూపాలు రూపొందించాడు. 2006లో చిత్రలేఖనం పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానం, 2008లో క్రియేటివ్ పెయింటింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి, 2015లో ఉత్తమ యువపురస్కార్ అందుకున్నాడు. 2015లో లండన్‌లో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీలలో 7వస్థానంలో నిలిచాడు. 2016లో అమెరికాలో జరిగిన ఆర్ట్ సెలక్షన్‌లో భాగంగా 200 డాలర్స్ ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్నాడు. 2020లో విశాఖపట్టణంలో జరిగిన నార్త్‌ఢిల్లీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అవార్డు అందుకున్నాడు. అనీల్ రూపొందించిన షాడో ఆర్ట్‌కు డిల్లీలో రూ.లక్ష రెమ్యూనరేషన్ సొంతం చేసుకున్నాడు. పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

ప్రత్యేక గుర్తింపు

- సాన అనిల్‌కుమార్, ఇల్లంతకుంట



విభిన్నమైన కళలతో ముందుకు పోతుండడంతో సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తోంది. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు. ఇప్పటి వరకు పెన్సిల్, పెన్నులతో 150 వరకు చిత్రాలు గీసాను. నాణేలతో వివేకానందుని చిత్రం, సుద్దముక్కలు, చీపురుపుల్లలతో వివిధ కళాకృతులు రూపొందించాను. అయితే షాడో చిత్రాలతో మంచి గుర్తింపు లభించింది. భవిష్యత్‌లో మరింత రాణించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాను.

నేడు పెద్దపల్లికి మంత్రి ఉత్తమ్ రాక

- ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు, సివిల్ సప్లయ్‌పై సమీక్ష
- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిసెంబరు 1వ తేదీన పెద్దపల్లికి రానున్నారు. ఆయన మధ్యాహ్నం 12 గంటలకు తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని మధ్యాహ్నం 1:30 గంటలకు పెద్దపల్లికి రానున్నారు. 1:30 నుంచి 3 గంటల వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంబంధిత అధికారులతో చేపట్టిన ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌ల పనులు, వాటి పరిస్థితి, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లపై సమీక్ష చేయనున్నారు. అలాగే పౌర సరఫరాల శాఖ ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపు, రైతుల ఖాతాల్లో రూ.500 బోనస్ జమ, సీఎంఆర్, రేషన్ షాపుల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన సీఎం సభలో కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటి వరకు పెండింగులో ఉన్న పలు ప్యాకేజీల పనులు, రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించేందుకు ఉమ్మడి జిల్లాలో చేపట్టాల్సిన పనుల గురించి వారం, పది రోజుల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం సమావేశాన్ని పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సమీక్ష అయిన తర్వాత కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో 4వ తేదీన నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు నాయకులు పరిశీలించనున్నారు.

పెద్దపల్లిలో సీఎం సభకు అధికారుల కసరత్తు

- రూ.378 కోట్ల పనులకు శంకుస్థాపన
- 9007 మంది గ్రూపు4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణి ఉద్యోగులకు నియామక పత్రాల పంపిణీ
- అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించనున్న యువత విజయోత్సవ సభకు అధికారుల కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో 378 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. 9007 మంది గ్రూప్ 4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు. హైదరాబాద్‌లో చేపట్టే స్కిల్ యూనివర్శిటీలో భాగస్వామ్యం అయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలపై సంతకం చేయనున్నారు. డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌తో పాటు సీఎం కప్‌ను ప్రారంభించనున్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే అవకాశాలు ఉన్నాయి. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారని, ఇక్కడ నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకునేందుకు ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి కాన్వాయ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా 266 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 66 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు, 10 కోట్లు వెహికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, 26 కోట్ల నర్సింగ్ కళాశాల, 10 కోట్లు శాతవాహన కళాశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనుల శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సీఎం సభాస్థలి వద్ద ఏర్పాటు చేసే స్టాళ్లను ఫైనల్ చేయాలని ఆర్డీఓకు సూచించారు. సీఎం వేదికపైకి చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేస్తారని, రాష్ట్ర గేయం వస్తుందని తెలిపారు. సభలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, మంత్రుల సందేశాలు ఉంటాయని, తర్వాత ఎంపిక చేసిన 10 మంది అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల పంపిణీ చేయనున్నారని, డిప్యూటీ సీఎం, ముఖ్యమంత్రి సందేశాలతో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. సభావేదిక పై ఉండే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర నాయకులు, ఉన్నతాధికారుల జాబితా ముందుగానే తయారు చేసి పోలీస్ శాఖకు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

సభా వేదికపై ఉన్న ప్రతి కుర్చీలో ఎవరు కూర్చునేది స్పష్టంగా తెలియజేస్తూ ఏర్పాట్లు చేయాలని అన్నారు. సభా ప్రాంగణం వద్ద అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో రుణమాఫీ, బోనస్ వచ్చిన రైతులు, మహిళ సంఘాల సభ్యులు సీఎం సభకు వచ్చేలా సమీకరణ చేయాలన్నారు. వారికి భోజనం బస్సు వద్దనే అందించాలన్నారు. సీఎం కార్యక్రమానికి విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలని కలెక్టర్ పరిపాలన అధికారికి సూచించారు. సీఎం సభకు వచ్చే ప్రజలు, అభ్యర్థులు, రైతులు వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆకట్టుకున్న ఒగ్గు డోలు ప్రదర్శన

- ఒడిశాలో జాతీయ నృత్య ఉత్సవాల్లో తాడిజెర్రి కళాకారులు



ప్రదర్శన ఇస్తున్న తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారులు

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో గంగాధర మండల తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఒడిశాలోని భవాణి పాట్నా అంబేద్కర్ స్టేడియంలో భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ 2024 గిరిజన జానపద సంప్రదాయ నృత్య మహోత్సవం నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహిస్తోంది. ఇందులో భాగాంగా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, పురుషుల బృందం ఒగ్గుడోలు ప్రదర్శనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రెండు రోజులుగా తాడిజెర్రి కళాకారులు నిర్వహిస్తున్న ప్రదర్శనలను దేశం నలుమూలల నుంచి వచ్చిన అధికారులు, కళారులు ప్రసంశిస్తున్నట్లు బృంద నాయకుడు ఏగుర్ల మహిపాల్ తెలిపారు.

అఖిల భారత బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా సింధు



సింధు సాధించిన ట్రోఫీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా జిల్లాకు చెందిన సింధు నిలిచింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా జోనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింధురెడ్డి సింగిల్స్, డబుల్ విభాగాల్లో విశేష ప్రతిభచాటి చాంపియన్‌షిప్‌ను సాధించింది. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాలోని విద్యానగర్‌కు చెందిన సింధూరెడ్డి నాలుగేళ్ల సుదీర్ఘ విరాం తర్వాత సింగిల్స్, డబుల్ విభాగాల్లో చాంపియన్‌షిప్ సాధించింది. సింధూరెడ్డి శంషాబాద్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సింధును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సన్మానించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గంగావత్ వెంకన్న, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

ధర్మపురిలో వైభవంగా గోదావరి మహా హారతి

- కార్తీకమాసం చివరివారం ఆలయాల్లో భక్తుల రద్దీ



ధర్మపురి వద్ద గోదావరికి మహా హారతి ఇస్తున్న పీఠాధిపతి అతిథేశ్వరానంద , పొల్సాని



వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి వేళలో అనేక మంది భక్తులు, మహిళలు, ఆర్‌ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు వెంటరాగా విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పొల్సాని మురళీధర్‌రావు మొదట గోదావరి నదికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు గోదావరికి మహాహారతి సమర్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు నదిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్లు దామెర రాంసుధాకర్‌రావు, బలుమూరి సంతోష్‌రావు, పాపారావు, హనుమాన్ సేవ సమితి అధ్యక్షుడు సాయిరెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత స్వామిజీ, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పొల్సాని మురళీధర్‌రావు దంపతులు వేర్వేరుగా సందర్శించారు.

- కార్తీకమాసం చివరివారం కావడంతో శనివారం ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి క్షేత్రంలో 29వ రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

రాజన్న ఆలయంలో..

వేములవాడ కల్చరల్: కార్తీక మాసం చివరివారం కావడంతో వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలంలో శ్రీకాళీ వారాహీ త్రిశక్తి పీఠం గురువు బ్రహ్మశ్రీ నవీన్‌శర్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకెపల్లి సుదీర్‌రెడ్డి రాజన్న ఆలయానికి రావ డంతో అధికారులు స్వాగతం పలికారు. శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ రాజన్న దర్శనానికి వచ్చారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ సిబ్బంది పర్యవేక్షించారు.

'మధ్యాహ్న భోజన విధులను ఉపాధ్యాయులకు ఇవ్వవద్దు'

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన తయారీలో ఉపాధ్యాయులకు విధులను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్వర్యంలో టీపీటీఎఫ్ బాధ్యుల సమా వేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించిన మాదిరిగా విద్యాశాఖకు సంబంధించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన విధులకు ఉపాధ్యాయు లను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నా మని అన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సరిగా మంజూరు చేయకుండా సరైన వసతులు కల్పిం చకుండా కేవలం ఉపాధ్యాయులను బాధ్యు లను చేస్తూ సస్పెండ్ చేయడం సరైన విధానం కాదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శినన్నబోయిన తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమాల రాంనాథ్‌రెడ్డి, విక్కుర్తి అంజయ్య, నాయకులు కిషన్‌రావు, పంజాల వెంకన్న, పురం వాసుదే వరావు, దబ్బెడ హన్మాండ్లు, నూగురి దేవేందర్, మందాడి శ్రీనివాసరెడ్డి, రజని రాణీ, తిరుపతి, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎడ్ల కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాలకుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుక్కలగూడూర్‌కు చెందిన ముగ్గురు యువకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందారు. బాధిత కుటుంబాలను మక్కాన్‌సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలిఠాకూర్ శనివారం పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మేడం బాపు, తోట ప్రశాంత్, సీపతి శంకరయ్య, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

కేశోరాం కార్మికులకు పదోన్నతులు

పాలకుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశోరాం సిమెంటు కర్మాగారంలో బేసిక్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 42 మందికి పర్మినెంటు కార్మికులుగా పదోన్నతులు లభించాయి. శనివారం ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డి, ఏపీపీఅండ్ ఐఆర్ మేనేజర్ పార్థసారథి, పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి దాడి మహేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, క్లబ్ సెక్రెటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణిలో పేరెంట్స్ డే

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్‌లో శనివారం పేరెంట్స్ డే నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. సంకల్ప శిక్ష ప్రోగ్రామర్ ప్రియ పోషకులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్ కుమార్, ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన ఎస్ఎల్‌సీ కార్యక్రమంలో విద్యార్థులు తయారుచేసిన యాక్టివిటీస్‌ను కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానం..

పాలకుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాలకు చెందిన దేవి చంద్రయ్య(58) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు సదాశివ ఫౌండేషన్ జిల్లా సలహాదారుడు దేవి లక్ష్మీనర్సయ్య ద్వారా ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానకు నేత్రాలు దానం చేశారు. మృతుడి భార్య రమాదేవి, కూతురు సింధు, సోదరుడు దేవి శ్రీనివాస్‌లకు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. కన్నాల మాజీ ఎంపీటీసీ దేవి స్రవంతి, అబ్దుల్ ఖాదర్ పాషా, కాసార్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత మృతికి సంతాపం

మంథని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ వార్డు సభ్యుడు శ్రీరాంభట్ల సతీష్ ఆకాల మృతి పట్ల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ళ శ్రీనుబాబు శుక్రవారం రాత్రి సంతాపం వ్యక్తం చేసి పార్థవ దేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులైన కాంగ్రెస్ నేత శ్రీరాంభట్ల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీరాంభట్ల సంతోషిని శ్రీనుబాబు పరామర్శించి తాను సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు శశిభూషణ్ కాచే, మాచీడి రాము, అజీం, రాజులు ఉన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

కమాన్‌పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని చౌరస్తాలో ఈనెల 24న నిర్వహించిన సదర్ కార్యక్రమానికి మండల కేంద్రానికి చెందిన మేకల కొమురయ్యకు తన దున్నపోతును తీసుకెళ్లారు. కార్యక్రమానికి సహకరించిన కొమురయ్యను యాదవ సంఘం నాయకులు సన్మానించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ యాదవ్, అధ్యక్షుడు గెల్లు లింగయ్య, బోధన హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

గ్యారంటీల పేరుతో దగా చేసిన కాంగ్రెస్..

● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తదితరులు

ముత్తారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో దగా చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లో భాగంగా శనివారం ముత్తారం మండలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ వికాసం పేరుతో ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఇస్తామని, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుచేస్తామని ఇచ్చిన హామీ ఎటుపోయిందని ప్రశ్నించారు. ఐదు లక్షల కాదు ఐదు రూపాయలు ఇవ్వకుండా కాంగ్రెస్ పాలకులు సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాదిలో ప్రజలకు ఏం చేశారని విజయోత్సవాలు చేసుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీల్లో అన్ని వర్గాల వారిని దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువ వికాసంలో రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క ఇంటర్నేషనల్ స్కూల్‌కు శంఖుస్థాపన చేశారా అని ప్రశ్నించారు. మేని ఫెస్టో కమిటీ చైర్మన్‌గా 420హామీలకు రూపకల్పన చేశామని గొప్పలు చెప్పుకునే మంథని ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఏ ఒక్క పథకం అమలు చేయలేదని అన్నారు. పథకాలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందుకేనా విజయోత్సవ సంబరాలు నిర్వహించుకుంటున్నారని ఆయన విమర్శించారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం ముత్తారం మండలంలోని కస్తూర్బా పాఠశాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు.

విధుల్లో క్రమశిక్షణతో పనిచేయాలి : సీఐ



హెడ్‌కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో క్రమశిక్షణతో పని చేయా లని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందికి సూచించారు. భూపాలపల్లికి బదిలీపై వెళుతున్న హెడ్‌కానిస్టేబుల్ వేణు, రాంమూర్తి, నర్సింగ్, మంచిర్యాల సీసీఎస్‌కు వెళుతున్న హేమసుందర్‌ను శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఎస్ఐలు రమేష్, భూమేష్ పాల్గొన్నారు.

సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లిలో డిసెంబరు 4న జరగబోయే నిరుద్యోగ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ పర్యటనకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున జనం తరలిరావాలని కార్యకర్తలు, నాయకులను సూచించారు. ఈ సభ నిర్వాహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించే అవకాశాలున్నాయన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, గ్రూప్-4లో ఉద్యోగం సంపాదించిన అభ్యర్థులు నియామకపు పత్రాలు అంజేస్తారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాలల చలో హైదరాబాద్

పెద్దపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగే మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల సంఘం నాయకులు కోరారు. పెద్దపల్లిలో శనివారం సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎరుకల రమేష్, సుదమల్ల అమ్రేష్, కారంగుల రమేష్, పెద్దపల్లి జిల్లా మాల సంఘం అధ్యక్షులు పోతుల వెంకటేష్, ఉపాధ్యక్షులు మద్దెల శీను, మద్దెల రాజయ్య, తదితులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ జన్మదినం



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ జన్మదినాన్ని శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాకాల గోవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరై కేక్‌కట్ చేసి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. నాయకులు మల్లికార్జున్, కల్వ లింగస్వామి, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో అల్పాహారం, నిరుపేదలకు దుప్పట్లను, చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు స్టడీ చైర్స్ అందజేశారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలోని భ్రమరాంభ మల్లికార్జునస్వామి క్షేత్రంలో అల్లం సతీష్ ఆధ్వర్యంలో పూజ నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొలనూర్‌లో ఎస్సీ రాజయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయగా గుండేటి ఐలయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే మడకలో చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వివేక్ యువసేన అధ్యక్షుడు పాటకుల మహేష్ ఆధ్వర్యంలో నోట్‌బుక్‌లు, పెన్నులను అందజేశారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాతో పాటు చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద వివేక్ వెంకటస్వామి చారిటబుల్ ట్రస్ట్ మెంబర్ కాడే సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రేస్ మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డిలు కేక్ కట్ చేశారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28న జరిగిన ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీలలో పెద్దపల్లి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఎస్. అక్షయ్, బి. అఖిల్, జి. అక్షిత, ఎం. లక్ష్మీ ప్రసన్న, ఎన్. అక్షిత, ఈనెల 30 నుంచి డిసెంబర్ 2వరకు హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఎంఈవో సురేంద్ర కుమార్, పాఠశాల ఇంచార్జి సురేంద్రప్రసాద్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నేటినుంచి తరగతులు ప్రారంభం

పెద్దపల్లి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంకు సంబంధించిన 1, 3 , 5 వ సెమిస్టర్ తరగతులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభమవుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు అందరూ తప్పక తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుణమాఫీకి వేళాయే..

(5వ పేజీ తరువాయి)

కార్డులు లేని వారివి ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల ఇళ్ల వద్దకు వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యులను నిర్ధారించారు. అలాగే 2,058 మంది రైతులకు సంబంధించి బ్యాంకుల్లో ఆధార్ నంబర్లు, పేరు, ఇంటి పేరు, గ్రామం పేరు, స్పెల్లింగ్ మిస్టేక్, తదితర తప్పులు దొర్లిన కారణంగా ఆ రైతుల ఖాతాల్లో రుణ మాఫీ సొమ్ము జమ కాలేదు. వీటిని బ్యాంకుల్లో సవరించి తిరిగి ప్రభుత్వానికి పంపించారు. ఇండియన్ బ్యాంకు తప్పిదం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఆ బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన వారికి రుణమాఫీ కాలేదు. అలాంటి వాళ్లు జిల్లాలో 3,066 మంది రైతులు ఉన్నారని జిల్లా వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఇతరత్రా కారణాల వల్ల మరికొంత మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రస్తుతానికి 8792 మంది రైతులకు నాల్గవ విడతలో రుణ మాఫీ డబ్బులు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. మిగతా రైతులకు కూడా మరో విడతలో ప్రభుత్వం రుణ మాఫీ చేయనున్నదని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. నాల్గవ విడత రుణ మాఫీ ప్రకటించడంతో మాఫీ అయిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

31 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు



కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వృద్ధులు

ఓదెల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి 31 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు కరీంనగర్ చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో విజయవంతమయ్యాయని మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ తెలిపారు. వారికి పండ్లు అందించి, ఉచిత రవాణా, భోజన వసతులు కల్పించామన్నారు. ఉచిత కంటి శస్త్రచికిత్సలకు సహకరించిన నేత్రవైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్, డాక్టర్ అనురాగ్ పవార్, లగిశెట్టి వంశీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గీతాంజలి డిగ్రీ కళాశాల కరెస్పాండంట్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) పెద్దపల్లి పట్టణానికి చెందిన దళితుడు కట్కూరి సందీప్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, ఇరుగురాల సంతోష్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిలుక ఆనంద్, బాధితుడు కట్కూరి సందీప్, బొంకూరి రాజమల్లు, నూర్ బీనా, గౌరమ్మ, మమత, చిలకమ్మ, అరికిల్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

గోదావరిఖని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మోదీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధాలను తిప్పికొట్టాలని ఐఎఫ్‌టీయూ ఆల్ ఇండియా అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44చట్టాలను మోదీ నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాశారని విమర్శించారు. సింగరేణిలో భూములు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, ఓసీపీల తవ్వకాలను నిలిపివేయాలని, కొత్తగా అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులను తవ్వాలని కోరారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, కృష్ణ, గోవింద్, విశ్వనాథ్, అశోక్, లింగయ్య, రామకృష్ణ, జ్ఞానేశ్వర్, రమేష్, చిట్టి బాబు, మదార్, అప్పారావు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

కమాన్‌పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి క్షేత్రంలోని కల్యాణ మండపంలో శనివారం గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిశు, ప్రాథమిక, ఉన్నత విభాగాలలో శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీలను నిర్వహించారు. గీత ప్రచార సమితి సభ్యులు వేపూరి రాములు, కాస సత్యనారాయణ, శంకర్, బాలయ్య తదితరులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో కార్మిక శాఖ అధికారిని నియమించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో డీసీఎల్ అధికారిని నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు సూచించారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఏర్పడి 8 ఏళ్లు పూర్తయిన నేటికీ డీసీఎల్ (కార్మికశాఖ అధికారి) నియమించకపోవడం మూలంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కరీంనగర్ వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికుల, యజమానుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా కేంద్రంలో డీసీఎల్‌ను నియమించాలన్నారు. ఎన్ బిక్షపతి, ఎం రామాచారి, సీపెల్లి రవీందర్, బూడిద గణేష్, వి, నాగమణి,జి, లక్ష్మారెడ్డి, ఎండి,కాజా, ఎస్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

మాజీ మంత్రిని అడ్డుకోవడం దుర్మార్గం

ధర్మారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గురుకులాలను పరిశీలించడానికి బయల్దేరిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ అన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించే వస్తుండగా, పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ నాయకులు పాఠశాలలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రిన్సిపాల్ సత్రం దేవసేన నిరాకారించారు. దీంతో నాయకులు రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఎస్ఐ శీలం లక్ష్మన్ చేరుకొని ధర్నాను భగ్నం చేశారు. మత్యాల బలరాంరెడ్డి, పూస్కూరి జితేందర్‌రావు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం రాగానే ధాన్యం కొనుగోలు చేయాలి



పెద్దబొంకూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం 17 తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. శనివారం ఆయన పెద్దపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పెద్దబొంకూర్, కొత్తపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యతను నిరంతరం పరిశీలించాలని, ధాన్యం తేమ శాతం 17 రాగానే వెంటనే కొనుగోలు చేసి, సెంటర్ కు కేటాయించిన రైస్ మిల్లులకు త్వరగా తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వంద శాతం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ పూర్తిచేయాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలని అన్నారు.



ఓసీపీ-3లో సదుపాయాలు కల్పించాలి

- ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ-2 సెక్రెటరీ ప్రవీణ్



వినతిపత్రం ఇస్తున్న ప్రవీణ్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3లో కార్మికులకు కనీస సదుపాయాలను కల్పించాలని కోరుతూ శనివారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్ మేనేజర్ భరత్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కేవలం ఉత్పత్తిపై దృష్టి పెట్టిన డ్యూటీకి వచ్చిన కార్మికుడు క్యాంటీన్‌కు వెళ్ళకుండా, యంత్రాలను చెక్ చేసుకునే సమయం ఇవ్వకుండా హడావిడి వాతావరణం సృష్టిస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్టు ప్రవీణ్ పేర్కొన్నారు. మెరుగైన ఇన్సెంటివ్ వచ్చేలా చూడాలని, ఎస్-1 రద్దు చేయాలని, కొత్త డీజిల్ బోజర్స్ కొనుగోలు చేయాలని, 100 టన్నుల డంపర్ పార్కింగ్‌ను మార్చాలని, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్లు మూడు కన్వేయన్స్ వాహనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రేడర్లు లేక వాహనాలు దెబ్బతింటున్నాయని, కొత్త గ్రేడర్లు అందుబాటులోకి తేవాలని కోరారు. ప్రాజెక్టులో కొన్ని పనులు పెండింగ్‌లో ఉండడంతో సంస్థకు నష్టం జరగడంతో పాటు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఉత్పత్తిపై ప్రభావం చూపే విషయాల్లో సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రవీణ్‌కుమార్ మేనేజర్‌ను కోరారు.

గుర్తింపు సంఘంతో ఆర్జీ-1 జీఎం స్ట్రక్చర్ మీటింగ్

- పలు సమస్యల పరిష్కారానికి సానుకూలత



స్ట్రక్చర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో శనివారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులతో ఏరియా స్థాయి స్ట్రక్చర్ సమావేశం నిర్వహిచారు. ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన పలు విభాగాల అధికారులతో జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఓసీపీ-5లో ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, మజ్దూర్‌ల సంఖ్య తక్కువగా ఉన్నందున పెంచాలని, అదేవిధంగా షావెల్స్, డోజర్స్, డంపర్‌లు, లోడర్లు, వాటర్ ట్యాంకర్లు అవసరం ఉన్నవి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏరియా వర్క్‌షాప్‌లో టిండాల్ ప్రమోషన్లు ఇవ్వాలని, అదేవిధంగా వెల్డర్లు తక్కువ ఉన్నందున పెంచాలన్నారు. జీడీకే 11ఇంక్లైన్‌లో 4సీమ్ 2వ డిప్ నందు చైర్ సిస్టం మ్యాన్ రైడింగ్ చేయాలని, గత సంవత్సరం నుండి ఇట్టి పనులు జరుగుతున్న పూర్తి కాలేదన్నారు. ఎల్‌హెచ్‌డీ సెక్షన్ లో గాలి సరిగా లేదు, వెంటిలేషన్ పెంచాలన్నారు. సీఎస్‌పీ-1లో వాటర్ ట్యాంకర్ ఏర్పాటుచేయడంతో పాటు ఐదుగురు టిండాల్ కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. జీఎం ఆఫీస్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల కోసం తల్లి పిల్లల సంరక్షణ కోసం రూమ్, ఇద్దరు ఆయాలను ఏర్పాటు చేయాలన్నారు. రీజనల్ అనాలిటికల్ ల్యాబ్‌లో ఉన్న రూములలో స్లాబ్ కూలుతుందని, వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని, అదేవిధంగా మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంట్, రీజినల్ ల్యాబ్ కలిపి కంపెనీ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, జీడీకే 2ఇంక్లైన్‌లో ఎస్‌డీఎల్ యంత్రాలు కాల పరిమితి ముగిసినందున, కొత్తవి తెప్పించాలన్నారు. అదేవిధంగా స్టోవింగ్ బంకర్ రిపేర్ చేయించాలి. ఏరియా హాస్పిటల్‌లోని మెడికల్‌స్టోర్ రూమ్‌లో అధిక వేడి వల్ల మెడిసిన్స్ పాడవుతున్నందున, కొత్త ఏసీలు, రిఫ్రిజిరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, స్కావెంజర్లు, జనరల్ మజ్దూర్ల సంఖ్య పెంచాలన్నారు. జీడీకే వన్ ఇంక్లైన్‌లో మహిళ కార్మికులకు స్టవింగ్ బంకర్ వద్ద పనిచేస్తున్న వారికి బాత్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యం అదేవిధంగా వారిని షైన్ నుండి బంకర్ వరకు వాహన సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సెంట్రల్ సెక్రటరి స్వామి, బ్రాంచ్ సెక్రటరి ఆరెల్లి పోషం, ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఏజీఎం(ఐఈడీ) ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఆంజనేయులు, ఏసీఎంఓ కిరణ్ రాజ్ కుమార్, డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏజెంట్స్ చిలక శ్రీనివాస్, రమేష్, పర్వేజ్ అధికారి బీమ్లా, డీజీఎం(వర్క్‌షాప్) జితేందర్ సింగ్, డీవైఎస్ఈ వరప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, వెంకట రెడ్డి, మదన్ మహేష్, వెంకటేష్, రాజు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కంపెనీ స్థాయి అథ్లెటిక్స్ పోటీల నిర్వహణపై సమీక్ష

రామగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కంపెనీ స్థాయి అథ్లెటిక్స్ త్రోబాల్, స్విమ్మింగ్ పోటీల నిర్వహణపై శనివారం జీఎం కార్యాలయంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అధ్యక్షతన అధికారులు, ట్రేడ్ యూనియన్ నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పోటీల నిర్వహణ ఘనంగా ఉండాలని జీఎం సూచించారు. డిసెంబరు 10,11 తేదీలలో రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించే కంపెనీ స్థాయి పోటీలను విజయవంతం చేయాలని జీఎం పిలుపునిచ్చారు. సమావేశంలో అధికారులు రఘుపతి, శేఖర్‌బాబు, రాజేంద్రకుమార్, సుదర్శనం, కొల శ్రీనివాస్, సునీల్ ప్రసాద్, నాయకులు కోట రవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రక్చర్ మీటింగ్‌లో పరిష్కారం కాని సమస్యలు

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో ఏఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల తరువాత జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. మారుపేర్ల అంశంపై స్పష్టత లేదని, ఎన్1 అంశం ఆడిట్‌బోర్డులో అనుమతి పేరుతో స్పష్టత లేకుండా పోయిందన్నారు. గతంలో మెడికల్ బోర్డులు నెలకు రెండు లేదా మూడు జరిగేవని, కానీ ఒక్క మెడికల్ బోర్డు కూడా జరుగడం లేదన్నారు. బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికున్ని అన్‌ఫిట్ చేయిస్తామని చెప్పినా, ఆ హామీ నెరవేరలేదన్నారు. రూ.22లక్షల ఇంటి రుణం, 250గజాల ఇంటి స్థలం, డిపెండెంట్ ఉద్యోగాల కోసం 35 నుంచి 40సంవత్సరాల నిబంధనలపై ఊసు లేదన్నారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, వెంకటేష్, చెల్పూరి సతీష్, అంజయ్య, రొడ్డ సంపత్, మల్లేష్, కిరణ్, ప్రదీప్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్మికుడికి సన్మానం



పదవీ విరమణ పొందిన కార్మిక దంపతులను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 జీడీకే వన్ సీఎస్‌పీలో పనిచేసే ఆరెల్లి మల్లేశం పదవీ విరమణ పొందగా శనివారం అధికారులు, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లేశం కుటుంబ సభ్యులు రాజ్‌కుమార్, స్వప్న, శ్రీకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.